

# చిన్న పరిశ్రమలు - పెద్ద కథలు

డాక్టర్ సోమరాజు సుశీల

యూనిట్‌కి వెడుతూనే శ్రద్ధగా దేవుడికి దణ్ణం పెట్టుకుని విశాఖపట్నం గ్రామ టెలిఫోన్ దేవతని ఆవాహన చేసి ఏ నక్షత్రాలూ లేని పూటకూళ్ళింటి నంబరు తిప్పా. ఆరుసార్లు ఆ గంట మోగాక మన సేవ కోసం సదా కొలువు తీరి వుండే మహానుభావుడు పలికాడు.

"రూమ్ నంబరు 110 ఇవ్వండి"– ఇంకొక ఆరుసార్లు వాళ్ల కాకి బెల్లు మొత్తుకున్నాక మా చిరంజీవి వినబడ్డాడు.

"ఇంత సేపేవిట్రా? ఏం చేస్తున్నావింత సేపు?"

"పొద్దున్నే ఏం చేస్తారే! నిద్ర పోతున్నా."

"పొద్దున్నే ఏం చెయ్యాప్పే ఎంత గొప్పగా చెప్పావురా! ఇప్పుడు టైం ఎంతయింది? నీకు నిన్న ఏం చెప్పాను?"

"ఇప్పుడు పావు తక్కువ ఆరు. నన్ను ఆరున్నర లోపల వెళ్లమన్నావు!"

"నీ తలకాయ! ఇప్పుడు తొమ్మిదిన్నరయింది. మన ఫ్యాక్టరీనించి చేస్తున్నాను."

"చూశావా. పడ్డావు బుట్టలో! మరి నేనంటే ఏమిటనుకున్నావు? పొద్దున్నే వెళ్ళొచ్చే మళ్లీ నిద్ర పోతున్నా."

"అఘోరించినట్టే వుంది నీ ప్రతాపం. ఇంతకీ ఆయనేమన్నాడు?"

"రాత్రి తొమ్మిదింటి కెడితే సినిమా కెళ్లాడన్నారు. సరే ఇంటికి రాక పోతాడా సినిమానించి అని అక్కడ బయట అరుగుమీద కూచున్నా. అమ్మా ఇక్కడందరికీ అరుగులున్నాయి. మనం కూడా అరుగులు కట్టించుకుంటే ఎంత బావుంటుందే?"

"ఎందుకు? బాకీల వాళ్లని కూచోబెట్టడానికా. విషయానికి రా! అసలే ఎస్.టి.డి."

"పదకొండు వరకూ కూచున్నాక మళ్లీ తలుపు కొడితే ఆవిడ విసుక్కుంటూ తలుపు తీసి 'సినిమాకెళ్లారని చెప్పా కదండీ. ఇంకా ఇక్కడేం సేత్తన్నారూ!' అని కసిరింది. 'ఎంత సేపండీ సినిమా' అంటే, 'మరి రెండో ఆట వద లాలాండీ' అని మళ్లీ తలుపేసుకుంది. ఇంక మర్యాదగా వుండదని రూం కొచ్చి పడుకుని ఐదింటికి అలారం పెట్టుకుని లేచి వెడితే అప్పుడే బయటకి వెళ్లి పోతున్నాడు. 'ఏదో లారీ వచ్చింది దింపుకోవాలి' అని పాపం నన్ను

## ప్లెజంట్ సర్ప్రయిజ్!

చూసి చాలా బాధ పడిపోయాడు నన్నిబ్బంది పెట్టానని."

"విషయం చెప్పు"

"వస్తున్నా! రేపు పండగట. ఎల్లుండి ఆది వారం. సోమవారం మధ్యాహ్నం రెండింటికి షావుకి రమ్మన్నాడు. ఇంక ఇక్కడ నేనుండ లేనే. బోరు కొట్టి చచ్చిపోతున్నాను. వాడిని డి.డి. పంపమని చెప్పి నేను గోదావరి ఎక్కే స్తాను. రేపు వినాయకుడి పూజ. పూజకి నీకు పాపం సాయం ఎవరు చేస్తారు? మధ్యాహ్నం నించి వై.ఎం.సి.ఎ.,లో మాచ్ వుంది నాకు – ప్లీజ్! ఇంకేం కొత్త ప్లాన్లు చెప్పకు!"


"మాచీ లేదు. ఏం లేదు. నువ్వొచ్చేస్తే మళ్లా ఆ పని వెనకబడి పోతుంది. వినాయకుడి పూజ చేయడానికి నేవున్నాలే. కావాలంటే నువ్వొచ్చాక ఉండ్రాళ్లు మళ్లీ చేస్తా. ఈ రెండు రోజులూ అక్కడే వుండు. తోచక పోతే శారద పిన్ని వాళ్లింటికి వెళ్లు. ఇప్పుడు వదిలితే మళ్లీ దొరకడు. వింటున్నావా?"

"ఆ! పెట్టెయ్!" టక్కున ఫోన్ పెట్టేశాడు. ఎంత చిరాకో వీడికి!.

మా వాడికి విసుగొచ్చిందంటే రాదూ మరి! ఈ పనిమీద వాడు విశాఖపట్నం వెళ్లడం ఇది నాలుగో సారి. సుమారు అరవై వేల రూపాయలు రావాలి. చాలా ఏళ్లనించి ఈ ఫీల్డ్‌లో వున్న పెద్ద వ్యాపారస్తుడు కదా అని ఏ నిబంధనలూ లేకుండానే ఐదారు లక్షల రూపాయల సరుకిచ్చాం. మొదట్లో అంతా కొంచెం ఆలస్యం చేసినా పదిసార్లు తిప్పినా ఇచ్చేశాడు. కానీ ఈ అరవై వేలకి మాత్రం ఎన్ని బాధలు పెడుతున్నాడో! ఎప్పుడు వెళ్లినా ఊళ్లో లేడనో, డబ్బంద లేదనో, వంట్లో బాగలేక కలెక్షన్లకి వెళ్లడం లేదనో, మార్కెట్ పరిస్థితి బాగా లేదనో, ఇంట్లో పెళ్లనో, చావనో ఏదో వంక పెట్టి పంపేస్తాడు. ఇంటికి వెడితే ఇప్పుడే షావు కెళ్ళాడంటారు. షావు కెడితే మార్కెటుకి వెళ్ళాడంటారు. ఇంక ఆ గుమాస్తాలని ఏ ప్రశ్నడిగినా ఒకటే సమాధానం 'తెలియదు సార్' అని.

వీడు బయల్దేర లేదనీ, ఇంక అట్నించి వచ్చేదేమీ లేదనీ తేలిపోయింది. నాకు సాధారణంగా రెడు రకాల డబ్బవసరాలు కలుగుతూ వుంటాయి. ఒకటి లాంగ్ టర్మ్ అంటే మూడు నాలుగు రోజులాగ గల్గినవి. రెండోది షార్ట్ టర్మ్ అంటే అప్పుడేగాని, ఆ సాయంత్రం లోపలగానీ ఎరేంజ్ అవవలసినవి. నాకున్న సకల సామర్థ్యాలూ, సమస్త శక్తియుక్తులూ ఈ రెండో రకానికి అమర్చేందుకే సరిపోతాయి. ఏ మాత్రం విసుగు చెందకుండా, నీరస పడకుండా, కాశ్మీర్ బోర్డర్‌లో కాపలా సైనికుడి లాగా ఈ వీర పోరాటం సాగిస్తున్నందుకు నాకు "ఉద్యోగ పగడ"లాంటి బిరుదులేమైనా ఇవ్వచ్చు. వాస్తవానికి లాంగ్ టర్మ్, షార్ట్‌టర్మ్ లోకి మారి ప్రాణం మీదకి వచ్చే వరకు నాకు బుర్ర సరి అయిన దారిలో పడదు. వీటినే చావు తెలివి తేటలంటారేమో మరి నాకయితే తెలియదు.

మా బంధువర్గంలో ఒక గొప్ప నమ్మకం, డబ్బు పాపిష్టిదని. తల్లీ బిడ్డల్నీ విడదీస్తుంది. వెధవ డబ్బు ఈ వేళుంటుంది రేపు పోతుంది వగైరా వగైరాలు. ఇక్కడ మా వాళ్ళు వప్పుకోనిది పాపిష్టిది డబ్బు కాదు. దాని మీద ఆశ అని. ఈ వేళుండేది అవసరం. రేపు పోయేది మాట నమ్మకం అని. నా మటుకు నాకు చేతిలో ఓ



వెయ్యి రూపాయలైనా లేకపోతే చాలా భయం భయంగా వుంటుంది. డబ్బిచ్చే ధైర్యం మరేదీ ఇవ్వదు. మా చిన్నప్పుడు మా అమ్మ- నాన్న తెచ్చే జీతంలో బాకీల వాళ్ళందరికీ కొద్ది కొద్దిగా సర్ది నానా అవస్థలూ పడుతూ సంసారం బండి లాగుతుంటే చూడలేక నా జీవితంలో ఎప్పుడూ డబ్బు లావాదేవీలు మాత్రం పెట్టుకోకూడదను కునే దాన్ని. ఎక్కడైనా మంచి ఉద్యోగం చేసి నిశ్చింతగా ఆనందంగా ఉండాలనుకునే దాన్ని. కానీ విధి విపరీతం. రూపాయంటే భయపడే నేను ఋణ ధన ధ్రువాలకి కనెక్టింగు వైరు నయ్యాను. ఒక్కటి మాత్రం ఎవరూ మర్చి పోకూడదు. ఏ విషయం గురించి మనం అమితంగా భయపడతామో అది ఖచ్చితంగా ఒకనాడు ఎదురవుతుంది. ఇంతలో పిలవకుం డానే రాజు లోపలికి వచ్చాడు.

"క్షమించండమ్మా!"

"సరే క్షమించానుగానీ ఏమిటి సంగతి?"

"మన మారేడ్‌పల్లి ఫ్లాట్‌లో అద్దెకుండే సరో జమ్మగారు నిన్న సాయంత్రం ఓపాలి, ఈ రోజు మీరు రాకముందో పాలి ఫోన్ చేశారమ్మా! మిమ్మల్నర్జంటుగా మాట్టాడమన్నారు!"

"విషయం చెప్పలేదా? అడక్క పోయావా?"

"పర్సనల్ అన్నారమ్మా. ఆరబ్బాయి సీటు కోసరమేమో నమ్మా!"

"ఆ విషయం నే నిన్ను అడగలేదు కదా! రెండుసార్లు ఆవిడ చేస్తే ఇప్పుడు తీరుబడిగా చెప్తున్నావా! పైగా పనికిమాలిన ఊహాగానాలొ కటి. ఆవిడకి కనెక్ట్ చేసెయ్యి!"

"నమస్కారమండీ. బాగున్నారా? మొన్న మా ప్లంబరుకి చెప్పానండీ మీ టాప్స్ లీకవు తున్నాయి, సరి చేయమని. అతను రాలేదా? పోనీ ఎవరితోనైనా చేయించెయ్యండి. అద్దెలో చూసుకుందాం. చిన్నచిన్న పనులంటే ఇతగాడు వినిపించుకోవట్లేదీ మధ్య!"


ఆవిడ కంఠం వినిపించింది. "అదలా వుంచండి. ఫరవాలేదు. నేను రెండు మూడు రోజులనించి మీకు ట్రై చేస్తే మీరు దొరకలేదు. అత్తగారితో కూడా చెప్పాను. మిమ్మల్నోసారి నాతో మాట్లాడమని. చివరికి నిన్న రాజుకి చెప్పా చాలా అర్జంటని."

"అతనిప్పుడే నాకు చెప్పాడు. ఏం జరిగింది?"

"మీరు ఈ ఫ్లాట్ మీద ఏదో కో ఆపరే టివ్ బాంకులో లోను తీసినట్టున్నారు. లోనిచ్చి మూడు సంవత్సరాలయింది కనక వడ్డీతో సహా 4.75 లక్షల రూపాయలు కట్టి ఎకౌంటు క్లోజ్ చేయమని నోటీసిచ్చి పోయారు. ఈ వేళే ఆఖరి రోజుట! కట్టక పోతే రికవరీ యాక్ట్ అప్లై చేస్తామని రాసి వుంది. ఇంత ముఖ్యమైన విషయం నేనే వచ్చి చెప్దామంటే నాలుగు రోజు లనించి నాకు జ్వరంగా ఉంటోంది. ఫోన్లో మీరు దొరకట్లేదు. వేరెవరికైనా విషయం చెప్తే మీరేమనుకుంటారో నని సంగతి చెప్పకుండా అర్జెంటు అర్జెంటని పదిసార్లు చెప్పాను. మరోలా అనుకోకండి. ఎవరినైనా పంపితే కాయితం ఇస్తాను."

"చాలా థాంక్సండీ. నే కనుక్కుంటా లెండి. ఇప్పుడే రాజుని పంపిస్తున్నా."

అస్సలు బుద్ధి లేదు. పొద్దున్నే తీరి కూచుని సంతోషపడి పోయా. ఈవేళ సీరి యస్ ప్రోబ్లొమ్సేం లేవు సాల్వ్ చేయడానికని. పూర్తిగా నాలుగు దిక్కులూ తెల్లారకుండా నన్నానంద పడమని ఎవరు చెప్పారు? మూడేళ్ళ క్రితం ఫ్లాటు కో ఆపరేటివ్ బాంకులో




పెట్టి మూడున్నర లక్షలు తీసుకున్నాం. మా వాడు, వాడి ఫ్రెండ్ ప్రదీప్ కలిసి ఆ పను లన్నీ చేశారు. ఎవరో మధ్యవర్తిని పట్టుకుని నానా తంటాలు పడితేగానీ ఆ పని కాలేదు. అప్పట్నించీ ఆర్నెల్ల క్రితం వరకూ ఇంటరెస్టు రెగ్యులర్‌గానే కట్టాం. నాల్నెల్ల క్రితం అసలు కోసమని లక్ష రూపాయలు కట్టినట్లు గుర్తు. మరి ఇంత ఎమౌంటెలా అయింది?

మళ్ళీ విశాఖపట్నం తిప్పా! లేకపోతే మా వాడెటన్నా పోవచ్చు. "బాబా! నువ్వు మన మారేడ్ పల్లి ఫ్లాటు లోను తాలూకు లక్ష బాంకుకి కట్టావు కదా!"

"ఇప్పడా అనుమానం ఎందుకొచ్చిందే? నాన్న ఎకౌంటు చెక్కు రాజుకిచ్చి పంపాగా. ఆ మధ్యాహ్నమే నాన్న ఎకౌంటులో లక్ష డిపాజిట్ నేనే చేశా!"

"మరి ఏమైందో. సరోజగారు ఫోన్ చేశారు. బాంకు నుంచి పూర్తి ఎమౌంటు కట్టి ఎకౌంట్ క్లోజ్ చేయమని నోటీసొచ్చిందట. ఈ వేళే లాస్ట్ డేటు. ఇంక మిగిలిందంతా వాళ్ల భాష!"

"నువ్వూరికే గాభరా పడకు! అంతా ఒక్క సారే డబ్బు కట్టే సీనున్న వాళ్ళు ఇళ్ళు తాకట్టు పెట్టి అప్పులెందుకు చేస్తారు. నువ్ ప్రదీప్‌ని తీసుకుని వెళ్లి ఎం.డి.ని కలు. ఏదో ఒక సొల్యూషను దొరుకుతుందిలే."

"నే వెడతాగానీ నువ్వు సోమవారం ఎలాగైనా ఆ వ్యవహారం పూర్తి చేసుకుని వచ్చేయి. నేను మంగళవారం కడతానని చెప్తాను. వాడి సెల్ నంబరు చెప్పు"

మా వాడి దోస్తులెవరూ మామూలు ఫోన్ల మీద దొరకరు. ఈ కుర్రాళ్ళ కోసమే అవి కనిపెట్టి నట్టున్నారు. వెంటనే ఆ పిల్లాడు దొరి కాడు. "మీరు తిన్నగా బాంకుకొచ్చేయండాంటీ. నేను రిసెప్షన్ దగ్గరుంటాను" అని చెప్పాడు.

ఇద్దరం కలిసి ఎం.డి.గారి రూమ్‌లో కెళ్ళాం. అక్కడ కుర్చీలనిండా మనుషులున్నారు. లోప లికొచ్చే వాళ్ళొస్తున్నారు, మాట్లాడే వాళ్ళు మాట్లాడుతున్నారు, వెళ్ళే వాళ్ళు వెళ్తున్నారు. ఎవరి గొడవలో వాళ్ళున్నారు. అక్కడ వాతా వరణ మేమీ హోదాగా లేదు. సీదాసాదాగా వుంది. కో ఆపరేటివ్ బాంకుల్లో ఎం. డి.లు వ్యాపారస్తుల్లాగా వుంటారు. చెప్పేది వింటారు. సబబనిపిస్తే ఒక సజావైన మార్గానికి ఒప్పకుం టారు. వడ్డీ వ్యాపార సూత్రాలు ఖచ్చితంగా పాటిస్తారు. కానీ అదే మామూలు పెద్ద బాంకుల్లో అయితే మాత్రం వాళ్ళేదో మరో ప్రపంచానికి సంబంధించినట్లు ఫోజులు కొడ తారు. కస్టమర్లంతా బిచ్చగాళ్ళయినట్లు వాళ్ళకి రూల్స్ తప్ప వాస్తవాలక్కరలేనట్లు భావిస్తారు.

నే కూచుని నా కథ మొదలుపెట్టా. "మొన్న మొన్నటి వరకూ ఇంటరెస్టు రెగ్యులర్‌గానే వుంది. ఈ రోజులోగా కట్టేయమని నోటీసిచ్చారు. ఇంత తక్కువ వ్యవధిలో కట్టాలంటే కష్టం కదా!"

వెంటనే ఆయన రికవరీ ఆఫీసర్ని పిలిచారు.

"మూడేళ్ళయి పోతోంది సార్– వీళ్ళకి మనం లోనిచ్చి. ఆర్నెల నించీ పేమెంట్సేం లేవు. వారం రోజుల క్రితం నోటీసిచ్చాం."

"ఒక లక్ష కట్టాం కదండీ! నాలుగు నెలల క్రితం."

"కడితే మేం ఎకౌంట్‌లో రాయకుండా వుండం కదా మేడం. మీరు కడదామనుకు నుంటారు. కావాలంటే కౌంటర్లో స్టేట్‌మెంట్ తీసుకోండి."

"సర్లెండి. మీరయితే పొరబాటు పడరు కదా. కట్టినా అంతే అయుంటుంది. కానీ మాకు కొద్దిగా టైం కావాలి. రావాల్సిన పేమెంట్స్ కొన్ని వున్నాయి."

ఎం.డి.గారడిగారు: "ఎంత టైం కావాలి?"

"మూడు నెలలు చాలు సార్."

"అయితే ఓ పని చెయ్యండి. రేపూ ఎల్లుండి సెలవు కదా. సోమవారం ఓ లక్ష కట్టి లెట రివ్వండి, మూడు నెలల్లో క్లియర్ చేస్తామని. ఇంక మళ్ళీ మళ్ళీ వాయిదాలు పెట్టద్దు."

"కానీ సోమవారం కుదరదు సార్! మా అబ్బాయి మంగళవారం తెస్తాడు."

"అలాగే కానీయండి." అని ఆయన మిగతా వాళ్ళతో మాట్లాడటం మొదలు పెట్టాడు.

కింద కొచ్చి కౌంటర్లో స్టేట్‌మెంట్ తీసుకుం దామంటే క్లర్క్ లంచ్ చేయడానికి వెళ్ళాడు. ఇంక వెయిట్ చేసే ఓపిక లేక ఆ అబ్బాయి నటు పంపేసి నేను యూనిట్ కొచ్చేశాను.

మంగళ వారం మా అబ్బాయొస్తాడని గొప్పగా చెప్పడమైతే చెప్పానుగానీ వాడికి పూర్తి డబ్బు ఇస్తాడన్న ఆశ ఏ మాత్రం లేదు. మహా అయితే రోజు బాగుంటే ఓ ఇరవై వేలు ఇవ్వచ్చు. నాదదేం జాతకమో. ఒక్కరోజు కూడా టెన్షను లేకుండా గడవదు. ఇంక ఎవర్నైనా అప్పడుగుదామన్నా అందరికీ సెలవలే కదా! నే యూనిట్‌కొచ్చే సరికి పాపం తాను కూడా కాస్త వర్రీ అయినట్లున్నారు. రాగానే అది గారు ఏమయిందని? నే చెప్పింది విని 'పోనీ, నేనేమైనా ప్రయత్నం చేయనా?' అన్నారు.

"ఎక్కడ చేస్తారు ప్రయత్నం? మీ కెవరు తెలుసని? ఇంటికెవరైనా వస్తే హాలులోకి రావడమే గగనమాయె!"

"అన్నీ నువ్వే అంటావు. నే కల్పించుకుంటే పన వదని నువ్వేగా చెప్తావు! నీకు వీలుగా ఉంటుం దనే నేనిలాంటి వ్యవహారాలకి దూరంగా వుంటా!"

"సరే! అలాగే వుండండి. నా తంటాలేవో నేను పడతాను. అయినా విశాఖపట్నం నించి కొంత రావచ్చు. ఇంకా మూడు రోజులు టైముంది. ముప్ఫయ్ ప్రపంచ యుద్ధాలు చెయ్యొచ్చు!"

"పోనీ ఓ ప్రయత్నం చేయరాదూ!"

"ఏమిటది?"

"అదే! ఏజ్ బారయినందుకు పట్టించుకో కుండా నీ ధైర్య సాహసాలు చూసి నిన్ను ఆర్మీలో చేర్చుకుంటారేమో. నీకు నీ యుద్ధ

సామర్థ్యం మీద చాలా నమ్మకం గదా!"

వీళ్లందరికీ నేనంటే వేళాకోళం. నా గొప్పలు నేనే చెప్పకుంటూ అందరి బుర్రలు తింటుంటానని. ఎంత గాడిద చాకిరీ చేసినా ఓ మెప్పూ లేదు, మెహర్బానీ లేదు. మరలాటప్పుడు నా మటుకు నేనైనా టముకు వేసుకోక పోతే ఎలా? ఒక్క నెల్లాళ్ళు నేనెటైనా పోతే అప్పుడు తెలిసొస్తుంది వీళ్ళకి నేనేమిటో! నా విలువేమిటో! అయినా ఈ విషయం తేల్చడానికిది సమయం కాదు.

చూస్తుండగానే వినాయకుడి పండగ, ఆ మర్నాడు ఆదివారం పండగ కూడా అయిపోయాయి. ఒక్క విశేషం కూడా జరగలేదు. ఇంతవరకూ ఎక్కడ కన్నమేయాలో ఎవరి బుర్ర బద్దలు కొట్టాలో కూడా తేల లేదు. టార్గెట్ ఫిక్స్ కాకుండా ఘాటింగేం చేస్తాం. అయినా ప్రయత్నలోపం వుండకూడదు కదాని సోమవారం పొద్దున్నే మాకెప్పుడూ ఇలాంటవసరాలకి ఆదుకునే ఖాన్ గారికి చేశాను. ఆయన దుబాయ్‌లో వున్నారని వాళ్ళ పి.ఎ. చెప్పింది. నెలకొకసారి కిట్టీ పార్టీలో తలా పది వేలు కట్టి లక్ష రూపాయలు మొత్తం ఒకళ్ళు తీసుకునే ఆటాడుకునే భాగ్యశాలి స్నేహితురాలికి ఫోన్ చేస్తే ఐదారు రోజుల్లో రాబోయే పార్టీలో తను తీసుకుని నాకిచ్చేస్తానంది. ఇలాగే నా ప్రయత్నాలన్నీ ములక్కుండా తేలకుండా అఘోరించాయి. ఇంక సాయంత్రం అయేటప్పటికి నాకు నీరసం వచ్చేసింది. అందులో మూడింటికి మా వాడు విశాఖపట్నం నించి ఫోన్ చేశాడు. ఆ పెద్ద మనిషి డిస్కౌంట్లన్నీ లెక్కలేసి 49 వేలకి తేల్చి, 13 వేల రొఖ్ఖం మిగతా 36 వేలకి ఐదు చెక్కులు నెలకొకటి వచ్చేలా రాసి వ్యవహారం సెటిలు చేశాడనీ తాను వస్తున్నాననీ ఆ ఫోన్ సారాంశం.

నాకు సంతోషించాలో దుఃఖపడాలో తెలియలేదు. ఆ డీల్ మొత్తంలో మాకు లాభం మాటటుంచి కనీసం టైం వాల్యూ కూడా గిట్టుబాటు కాలేదు. అందుకే మాలాంటి వాళ్ళు వ్యాపారం చేస్తే లాభాలు కాయితాల్లో వుంటాయిగాని రూపాయిల్లో ఉండవు.


రాత్రి రెండు కాంపోజుల మహాత్యం వల్ల నిద్రైతే పట్టింది కానీ అన్నీ పీడ కలలే! ఆ రికవరీ ఆఫీసరు మా ఇంటికి భోజనానికొచ్చాడుట. నే అన్నిట్లోనూ ఉప్పనుకుని పంచదార, జీలకర్ర పొడనుకుని మెంతి పిండి వేశానుట. ఆయన తినలేక పోనీ మజ్జిగ పోసెయ్యండంటే వెంటనే ఫ్రిజ్‌లోంచి తెచ్చి దోసెల పిండి వడ్డించానుట. ఆయన నాకేసి కోపంగా చూసి కంచంలో చెయ్యి కడిగేసుకుని వెళ్ళి పోయాడుట.

ఇలాంటి పిచ్చిపిచ్చి కలలన్నీ మా ఇంట్లో వాళ్ళ అదృష్టం కొద్దీ మెలకువ వచ్చేసరికి మర్చిపోతాను. కానీ ఇది మాత్రం గుర్తుండిపోయింది. ఎప్పట్లాగానే ఇది విని మా అత్తగారితో సహా మహదానంద పడిపోయారు– భలేగా అయిందని.

ఆ వేళ నేను పొద్దున్నే ఈ బాంకు పేరు చెప్పకుని మా ఆయన దగ్గర రోజు మొత్తానికి ఆన్ డ్యూటీ పర్మిషన్ తీసేసుకున్నాను. ఇంక ఫ్యాక్టరీ కెళ్ళే పనిలేదు. ముందు పైలట్ కారులాగా మా వాడిని, ప్రదీప్‌ని పంపించా. ఎం.డి.గారిని ఊరికే కలిసినట్లుగా కలిసి ఓ నాలుగు రోజులు టైం అడగండిరా వీలైతే అని. వెళ్ళే టప్పుడు మా వాడు నాకేసి చూసిన చూపు నా జన్మలో మర్చిపోలేను.

అసలే ఆ బాంకులో వంటి గంట వరకే ట్రాన్సాక్షన్స్ చేస్తారు. ఈ లోపల డబ్బు కట్టడం అనేది వీలవదని తెలుస్తూ వుంది. అసలే టైము తక్కువగా వుంది. ఆ[illegible]ంగ్ రేటు


కేశవర్ధిని...
పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం



పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనె.
అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన
శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందచేశారు.


కొద్ది చుక్కల కేశవర్ధినిని ఒక చెంచాడు కొబ్బరినూనెలో
కలిపి శిరోజాలకి రోజూ రెండుసార్లు బాగా రాస్తే అవి
ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా, నిగనిగ
లాడుతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.

ఈ రోజునే కేశవర్ధిని కొనండి.
ఆరునెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.




కేశవర్ధిని
తలనూనె

కేశవర్ధిని ప్రోడక్ట్స్ మద్రాసు-600 087




“ఏవిటి ప్రదీప్? రాత్రి బెర్తు దొరక్క, వీడికి రైలు ప్రయాణంలో పైత్యంగానీ చేయలేదు కదా!”

ప్రదీప్ నవ్వుతూ చెప్పాడు. “ నిజంగానే మీరు బాంకుకి వెళ్ళి పోండాంటే? మేం డబ్బు తీసుకుని తిన్నగా అక్కడకి వస్తాం. అప్పుడు మీరు బాంకులో కట్టేందుకు అంకుల్ ఇచ్చిన చెక్కు వీళ్ళు కలెక్షన్‌కి పంపారుట. కానీ ఆ చెక్కు మీద బ్రాంచి స్టాంపు లేకపోవడంతో వెనక్కి వచ్చేసిందిట. కాబట్టి అంకుల్ డబ్బు అంకుల్ ఎకౌంట్‌లోనే ఉండిపోయిందన్నమాట. ఇందాక కౌంటర్ దగ్గర స్టేట్‌మెంట్ తీసుకుంటుంటే ఆ క్లర్కు ఈ చెక్కు తిరిగి ఇచ్చేశాడు. మేం ఇద్దరం తొందరగా ఆ డబ్బు డ్రా చేసుకొస్తాం.”

ఇద్దరూ హుషారుగా స్కూటరెక్కి వెళ్ళిపోయారు. నేను స్థిమితంగా డైనింగ్ టేబిల్ దగ్గిర కూచుని అన్ని నియమాలకీ నీళ్ళొదిలేసి ఆవకాయ, బోలెడు నెయ్యి పెరుగు మీద మీగడ వగైరాలతో సుష్టుగా పూర్తిగా భోజనం చేసి నాదైన టైపులో సెలబ్రేట్ చేసుకుని దర్జాగా కారెక్కా.

ఎక్కువ. కనీసం ఓవరుకి తొమ్మిది రన్స్ అవాలంటే ఎవరికి ఉత్సాహం వుంటుంది? అయినా ఏదో గుర్తొచ్చిన నంబర్లకి ఫోన్లు చేస్తూనే వున్నా. ఇంక చివరకి తెగింపొచ్చేసింది! కట్టలేం. అయితే ఏమవుతుంది? ప్రాణాలైతే పోవు కదా? చూద్దాం. ఏదెలా జరగాలనుంటే అలా జరుగుతుంది. మన చేతిలో లేని విషయాలకి మనం మాత్రం ఏం చేస్తాం? పన్నెండయి పోతోంది. ఆ వెళ్ళిన కుర్రాళ్ళు రామూ లేదు – ఫోనూ లేదు!

ఇప్పుడర్థమవుతోంది. మామూలుగా పెద్దమనుషులుగా పేరు పడ్డ వాళ్ళు కూడా విషయాలు శృతి మించినవుడు, పరిస్థితి చేయి దాటినవుడు ఎందుకు విడ్డూరంగా మాట్లాడుతారో! అడ్డగోలుగా ప్రవర్తిస్తారో! ఈ వ్యవహారం వల్ల నాకర్థమైందేమిటంటే మనుషుల అసంబద్ధ ప్రవర్తనకి, నీటి మీద రాతలకి పరిస్థితులే కారణమని. ఎక్కడో ధర్మరాజో, హరిశ్చంద్రుడో, శ్రీరాముడో అన్ని వేళల్లోనూ ఒకేలాగ వుంటారు కాబట్టి వాళ్లు పడ్డ కష్టాలు మనం కథలుగా చదువుకుంటాం! అది అంతవరకే. మనకి వర్తించవు.

ఇంటి ముందు స్కూటరాగింది. మా వాడు, ప్రదీప్ చెరో సెంచరీ కొట్టిన క్రికెట్ వీరుల్లాగా లోపలికొచ్చారు. వాళ్ళని చూడగానే నా కర్థమైంది ఎం.డి.గారొప్పుకున్నారని!

“నిన్న ఎం.డి.గారిని కలవమన్నది నేనే కదురా! చూశావా. ఎంత మంచి సలహా ఇచ్చానో!”

“ అమ్మా నీకన్నిటికీ కంగారే! ఎం.డి.గారు ఇంకా రానే లేదు. నువ్వేమో బాంకు వాళ్లని తిట్టడమే వృత్తిగా పెట్టుకున్నట్లు అస్తమానం ఏదో ఒకటి అంటుంటావు. పాపం వాళ్లెంత మంచివాళ్ళో! మనం ఈ రోజున ఇలా వున్నామంటే వాళ్ళే కదా కారణం! మనకెన్నెన్ని ఉపకారాలు చేశారో మర్చి పోతే ఎలా? అవును! ఇంతకీ నాన్న చెక్కు బుక్కు ఎక్కడుంది?”

“నీకిప్పుడు దానితో ఏం పని? రాజు దగ్గరుంటుంది. అయినా నాన్న ఎకౌంటులో రెండొందలు కూడా వుండి వుండవు.”

“ఓ వీరమాతా! నా వంటి వీర కుమారుడిని కన్నందుకు నీ జన్మ ధన్యమైంది. నువ్వు మంచి పట్టు చీర కట్టుకుని రాణి ఝాన్సీ లక్ష్మీబాయి లాగా వెళ్ళి దర్జాగా ఎం.డి.గారితో సంధి ప్రయత్నములు సలుపుము. ఈ లోగా నీ వీర కుమారుడు అరగంటలో లక్ష రూపాయలతో అరుదెంచగలడు.”

